విద్యార్థుల దీపావళి సందడి



శంషాబాద్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపాలు వెలిగించి శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండగ ప్రాశస్త్యాన్ని ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నిషాత్ తన్వీర్ వివరించారు. కార్యక్రమంలో డీన్ ప్రియామనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దీపావళి వేడుకలు



రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని ముగ్గులతో దీపాలతో పాఠశాల ప్రాంగణాన్ని అలంకరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుధా దీపావళి పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. డీన్ ప్రియా, మనీష్, ప్రిన్సిపాల్ సుధా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువ సమర్థ ఫెస్ట్



యువ సమర్థ ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రసన్న లక్ష్మి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఉన్న శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో యువ సమర్థ 2023 ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ కోఆర్డినేటర్ కె.ప్రసన్న లక్ష్మి ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు సాంకేతికలో తాజా పురోగతులను ప్రదర్శించడం, నేర్చుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కళాశాల వైస్ చైర్మెన్ డాక్టర్ కె.రాధాకిషన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నర్మద పాల్గొన్నారు.

13న యాదవ సదర్



మజ్జిగ నరేశ్ యాదవ్

రాజేంద్రనగర్: బుద్వేల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన యాదవ సదర్ సందడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాజేంద్రనగర్ ఉపాధ్యక్షులు మజ్జిగ నరేశ్ యాదవ్ తెలిపారు. బుద్వేల్ శివాలయం వద్ద ఈ కార్యక్రమాన్ని రాత్రి 9 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. బుద్వేల్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన దున్నపోతులు ఈ సదర్‌లో పాల్గొంటాయన్నారు. అందంగా ముస్తాబు చేసి తీసుకొచ్చిన దున్నపోతులకు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి 9 గంటల నుంచి ఈ సదర్ సందడి ప్రారంభమవుతుందన్నారు.

విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో లక్ష్మీ పూజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం లక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఆర్ జోన్ సీజీఎం ఆనంద్, రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ ఎల్.గోపయ్య, డివిజనల్ ఇంజనీర్లు పి.రత్నాకర్ రావు, పి.రాజారాం రెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి



రాజేంద్రనగర్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల రాజేంద్రనగర్ విద్యార్థులకు ఆమెజాన్ ఉద్యోగి నరేందర్ రెడ్డి, ఆయన సతీమణి సౌజన్య నగదు బహుమానం అందజేశారు. ప్రతిభ చూపిన మంజుల చవాన్‌కు రూ.10వేలు, గణేష్‌కు , నిష్ట, ప్రాచీలు ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య పాల్గొన్నారు.

కారు ఢీ కొని వ్యక్తి మృతి



మణికొండ: బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తిని కారు ఢీ కొనటంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోకాపేటలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు.. కోకాపేటలోని రాజపుష్ప రేగాలియా గేటెడ్ కమ్యూనిటీలో నుంచి గండిపేట–నార్సింగి రహదారిపైకి బైక్‌పై సురనేని హేమ సుందర శోభనాద్రిరావు (68) వచ్చాడు. అదే సమయంలో గండిపేట నుంచి నార్సింగి వైపు వెళుతున్న కారును అతను బైక్‌తో ఢీ కొట్టాడు. దాంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధంతేరస్ వేడుకలు

చార్మినార్: ధంతేరస్‌ను పురస్కరించుకొని పాతబస్తీలోని బంగారు ఆభరణాల దుకాణాల యజమానులు వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించడంతో షోరూంలన్నీ కళకళలాడాయి. దీపావళి పర్వదినానికి ముందే వచ్చే ధంతేరస్‌ను ప్రజలు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ధంతేరస్‌కు ఎంతో కొంత బంగారం ఖరీదు చేస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయని భావించే ప్రజలు అత్యధిక సంఖ్యలో బంగారం ఖరీదు చేయడానికి జువెల్లరీ షాప్‌లను సందర్శించారు. ధంతేరస్‌కు తప్పనిసరిగా బంగారాన్ని ఇంటికి తీసుకెళ్లాలనే ఆచారంతో మహిళలు కుటుంబసభ్యులతో కలిసి బంగారు ఆభరణాలు ఖరీదు చేయడానికి రావడంతో జువెల్లరీ షాప్‌లన్నీ కిటకిటలాడాయి.

టీటీడీ అడ్వైజరి కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా మెట్టు రాఘవేంద్ర

అబిడ్స్: టీటీడీ అడ్వైజరి కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా గోషామహల్‌కు చెందిన రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మెట్టు రాఘవేంద్రను నియమించారు. టీటీడీ ఆయనను నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది. మెట్టు రాఘవేంద్ర మాట్లాడుతూ.. తాను అడ్వైజరి కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనను నియమించిన ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ బోర్డుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగోసారి విజయం నాదే

బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్



నామినేషన్ వేయడానికి వెళ్తున్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: తనను ప్రజలు నాలుగోసారి ఆదరిస్తారనే నమ్మకం కొండంత ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ బంగారు మైసమ్మ ఆలయం, దుర్గానగర్ దుర్గామాత ,ఉడంగడ్డ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. కాటేదాన్ నుండి భారీ ర్యాలీగా వివిధ రకాల నృత్యాలతో ,తెలంగాణ సంస్కృతికి చిహ్నమైన బోనాలతో మహిళలు, యువకులు బ్యాండుమేళాలతో అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. ప్రజల అండదండలతోనే మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. కార్యక్రమంలో శంషాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గణేష్ గుప్తా,టి ప్రేమ్‌దాస్ గౌడ్,దేవదాస్‌గౌడ్ ,రాజేంద్రనగర్‌లోని ముఖ్యనేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీగా బయలుదేరిన డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తదితరులు

ప్రకాష్‌గౌడ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయం

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాటు చేసిన ర్యాలీకి హైదర్షాకోట్ నుంచి నాయకులు, కార్యకర్తలతో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ గూండా ఆడి పాడి సంబరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ వెంటే ప్రజలంతా ఉన్నారన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల భారీ ర్యాలీ



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి టి.ప్రకాష్‌గౌడ్ నామినేషన్ కార్యాక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బండ్లగూడలో కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు ర్యాలీకి నాయకులతో కలిసి తరలివెళ్లారు.

తొమ్మిదిన్నరేళ్లలో అనేక అభివృద్ధి పనులు



నామినేషన్‌ను అందజేస్తున్న ప్రకాశ్ గౌడ్

అత్తాపూర్: ఉమ్మడి రాష్ట్రంలో జరగని అభివృద్ధి సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో సాధించి చూపెట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం చివరి రోజు ప్రకాశ్ గౌడ్ మరోసారి నామినేషన్ పత్రాలను రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా మీడియా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కేవలం తొమ్మిదిన్నరేళ్లలో అభివృద్ధిని చూసి కోట్లాది రూపాయల సొమ్మును స్థానికంగా పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెడుతున్నారని... దీనికి ఐటీ మంత్రి కేటీ రామారావు తనదైన శైలిలో కృషి చేయాలని గుర్తు చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేందర్ రెడ్డి, సురేశ్ రెడ్డి, లక్ష్మీనారాయణ గుప్తా, రామ ఇంద్రపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బుద్వేల్‌లో బీజేపీ ఎన్నికల ప్రచారం



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ బుద్వేల్‌లో బీజేపీ పార్టీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అర్బన్ కార్యవర్గ సభ్యుడు రాఘవేంద్ర చారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హజరయ్యారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీ పార్టీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలంటూ విన్నవించారు. పార్టీ సీనియర్ నాయకులు మూల శ్రీనివాస్ గౌడ్, సదానంద్, బాలకృష్ణ, శత్రుఘ్న, రాకేశ్ గౌడ్, సురేందర్, యాదయ్య పాల్గొన్నారు.

ప్రాచీన లలిత కళలను కాపాడుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న వరప్రసాద్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రాచీన లలిత కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాట్యగురువుల పైనే ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో భారతవేద అసోసియేషన్ ఆధ్వర్యంలో గురుశిష్య పరంపర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాచీన కాలం నుంచి వస్తున్న నాట్య సంపదను భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు.

అనంతరం పలువురు నృత్యగురువులను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భాగ్యలక్ష్మి అమ్మవారికి దీపావళి పూజలు



పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావు కుటుంబసభ్యులు

చార్మినార్: భాగ్యలక్ష్మి ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి శుక్రవారం భక్తులు క్యూ కట్టారు. ధంతేరస్ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి సాంబశివరావు కుటుంబసభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ధంతేరస్‌ను పురస్కరించుకొని ఉదయం 4 నుంచి 5 గంటల వరకు అమ్మవారికి పంచామృతంతో అభిషేకం, ఉదయం 7 గంటలకు హారతి, సాయంత్రం 7 గంటలకు అమ్మవారి దీప్ దర్శనం తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఆకట్టుకున్న వైష్ణవి భరత నాట్య అరంగేట్రం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు ఎం.బద్రీనాథ్ శిషురాలు మెగురు వైష్ణవి భరతనాట్య అరంగేట్ర ప్రదర్శన శుక్రవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. నాట్యాంజలి పేరిట నిర్వహించిన ఈ ప్రదర్శనలో పుష్పాంజలి, వినాయక స్తోత్రం, తాగ్యరాజ కీర్తన వంటి పలు అంశాలపై సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి డైరెక్టర్ వి.ఉదయ్‌శంకర్, నాట్య గురువు కళాకృష్ణ, బాలానందం ట్రస్టు అధ్యక్షులు జేవీ కామేశ్వరీ, భరతనాట్య కళాకారిణి ఎం.సబిత తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు



గోల్కొండ: సైబర్ సెక్యూరిటీ అనేది నేడు అత్యంత ప్రధానమైన అంశంగా మారిందని ప్రముఖ రిసోర్స్ పర్సన్, ఇంజినీర్ సాంబమూర్తి అన్నారు. శుక్రవారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ బిల్డ్ స్మాల్ ఆఫీస్ నెట్‌వర్క్ అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సాంబమూర్తి హాజరై నెట్‌వర్కింగ్ టెక్నాలజీ అండ్స్ ఆన్ ఎక్సర్‌సైజ్ అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విగ్‌వెన్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ కోలార్, కళాశాల చైర్మన్ రాఘవరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ శ్రీవిద్య, ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ఐటీహెచ్‌ఓడీ రామచంద్రన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కౌన్సిలర్



మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డుకు చెందిన బీజేపీ కౌన్సిలర్ వి.హైమాంజలి శుక్రవారం ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న కృషికి ఆకర్షితురాలినై పార్టీలో చేరినట్టు ఆమె ప్రకటించారు. కార్యక్రమంలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, చిత్రపురి వాసులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డిని గెలిపించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు విజయ్ కుమార్ అధ్యక్షతన కేశవ్‌నగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్ యాదవ్, చెవెళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లా రెడ్డి పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఓట్లు అడిగే అర్హత మాకే ఉంది



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్

అత్తాపూర్: ఓట్లు అడిగే అర్హత మాకు తప్ప ఎవరికీ లేదని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన రాజేంద్రనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు తన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక న్యాయానికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని... దేశ వ్యాప్తంగా ప్రజలకు ఈ విషయం తెలుసునని పేర్కొన్నారు. కేసీఆర్‌కు ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ పెట్టిన భిక్ష అన్నారు. బీఆర్ఎస్‌ను గద్దె దింపడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కొండకళ్ల నాగేందర్ రెడ్డి, బండారి రమేశ్, సోమవారం రవీందర్ పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ 2023



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్లు

ఓటు వేయడం మన బాధ్యత

మణికొండ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రలు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ సిబ్బంది, పౌరులతో కలిసి మణికొండలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు, పౌరులు పాల్గొన్నారు.

చిత్రపురి సమస్యలు తీర్చండి



మంత్రి కేటీఆర్‌ను కలిసిన చిత్రపురి కాలనీ కౌన్సిలర్ హైమాంజలి అనిల్‌కుమార్

మణికొండ: చిత్రపురి కాలనీ ప్రజలకు ఉన్న సమస్యలను తీర్చాలని మణికొండ మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ వల్లభనేని హైమాంజలి అనిల్‌కుమార్ మంత్రి కేటీఆర్‌ను కోరారు. శుక్రవారం ఉదయం ఆమె బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో చేరారు. సాయంత్రం ఆమె తిరిగి మంత్రి కేటీఆర్‌ను నగరంలో కలిసి చిత్రపురి కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వాటిని రాబోయే ప్రభుత్వంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని కౌన్సిలర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రపురి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన వేణుగోపాల్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ అభ్యర్థి రెబల్ అభ్యర్థి బి.వేణుగోపాల్ తన నామినేషన్‌ను శుక్రవారం దాఖలు చేశారు. బీజేపీ పార్టీ నుండి తోకల శ్రీనివాస్ రెడ్డితో పాటు వేణుగోపాల్ టికెట్ ఆశించాడు. బీజేపీ అధిష్టానం తోకల పేరును ప్రకటించింది. అప్పటి నుంచి వేణుగోపాల్ అసంతృప్తితో ఉన్నాడు. శుక్రవారం తన నామినేషన్ పత్రాలను అనుచరులతో వేయించాడు.

అభినందనలు



చార్మినార్: ఛత్రినాకకు చెందిన కే.సాత్విక్ జాతీయ స్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. శంషీర్‌గంజ్‌లోని హబీబ్ ముస్తఫా బాక్సింగ్ అకాడమీలో శిక్షణ పొందిన సాత్విక్ ఆగ్రాలో జరిగిన బాక్సింగ్ చాంపియన్‌షిప్ 52 కేజీల విభాగంలో తెలంగాణ హైదరాబాద్ రీజియన్ నుంచి విజయం సాధించారు. ఫైనల్‌లో హరియాణా గురుగాం రీజియన్‌తో పోటీ పడిన సాత్విక్ విజయం సాధించి గోల్డ్ మెడల్ దక్కించుకున్నారు. శుక్రవారం ఆయన కోచ్ హబీబ్ ముస్తఫా అతడిని అభినందించారు. సాత్విక్ బార్కాస్‌లోని కేంద్రీయ విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

రాజేంద్రనగర్ మజ్లిస్ పార్టీ అభ్యర్థి స్వామి యాదవ్



నామినేషన్ దాఖలు చేస్తున్న రాజేంద్రనగర్ మజ్లిస్ పార్టీ అభ్యర్థి కార్పొరేటర్ స్వామి యాదవ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా శుక్రవారం కార్వాన్ డివిజన్ మజ్లిస్ పార్టీ కార్పొరేటర్ స్వామి యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. అత్తాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి మల్లయ్యకు తన నామినేషన్ పత్రాలను ఎమ్మెల్సీ రహమత్ అలీ బేగ్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీ అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు.

మారిన అభ్యర్థి...

రాజేంద్రనగర్ నియోజకవర్గం మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా గతంలో పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ మాజీ కార్పొరేటర్ రవి యాదవ్ పేరును ఖరారు చేశారు. బుధవారం నియోజకవర్గంలో ఆయన పర్యటన సైతం నిర్వహించారు. గురువారం ఉదయం నుండి పార్టీ అభ్యర్థిని మారుస్తున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. చివరకు శుక్రవారం ఉదయం కార్వాన్ కార్పొరేటర్ ఎం.స్వామి యాదవ్ మజ్లిస్ పార్టీ తరపున నామినేషన్ దాఖలు చేశారు.

ప్రత్యేక పూజలు చేసి.. నామినేషన్లు వేసి..

మణికొండ: రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ శుక్రవారం పుప్పాలగూడలోని కాశీవిశ్వేశ్వరాలయం, పోచమ్మ దేవాలయాల్లో నామినేషన్ పత్రాలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ఊరేగింపుగా నామినేషన్ దాఖలుకు బయలు దేరారు. పుప్పాలగూడ నుంచి ప్రారంభమైన ఆయన ర్యాలీ నార్సింగి, మంచిరేవుల, అప్పా సర్కిల్ బండ్లగూడ, కిస్మత్‌పూర్, బుద్వేల్‌ల మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది.



కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు చేసిన నరేందర్‌ముదిరాజ్